వేగంగా తాగునీటి పైప్‌లైన్ ప్రాజెక్ట్ పనులు

- నరసాపురంలో రూ.61.81 కోట్లతో పైప్‌లైన్ల ప్రక్షాళన
- 45 ఏళ్లనాటి పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- అదనంగా మరో 4 ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం


నరసాపురంలో ఉన్న భారీ మంచినీటి చెరువు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లు పూర్తిగా ఆధునికీకరణతో పాటు అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మున్సిపాలిటీకి రూ.61.81 కోట్లతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ మంజూరు చేసింది. దీనికి సంబంధించి సాంకేతిక అనుమతులు ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జీవో నెంబర్ 15 విడుదల చేసింది. తర్వాత నాలుగు నెలల జాప్యం అనంతరం ఈ కీలక ప్రాజెక్ట్‌కు సంబంధించి టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో పట్టణంలోని దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. ఈ చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి.

పైప్‌లైన్లు శిథిలమవ్వడంతో చిక్కు..

మున్సిపల్ లెక్కల ప్రకారం ఏ ఇబ్బంది లేకుండా రెండు పూటలా కుళాయిల ద్వారా తాగునీరు ఏ ఇబ్బంది లేకుండా అందించవచ్చు. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్లు శిథిలమవ్వడం వల్లే వస్తోంది. మంచినీటి చెరువు పక్కన ఉన్న ప్రాంతాలకు కూడా తాగునీరు సవ్యంగా అందని పరిస్థితి. పైప్‌లైన్లు బాగోలేక పోవడంతో తక్కువ ప్రెషర్‌తో నీటిని వదులుతున్నారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్ళు సవ్యంగా రావు. ఒకవేళ ఎక్కువ ప్రెషర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్లకు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజ్‌లు ఏర్పడే పరిస్థితి ఉంది. పైప్‌లైన్‌ల లీకేజ్‌లు కారణంగా రాయిపేట, రుస్తుంబాద, స్టేషన్‌పేట, చిన మామిడిపల్లి, వీవర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్, నందమూరి కాలనీ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

ఎన్నో ఏళ్లనాటి సమస్య

పట్టణంలోని పొన్నపల్లి, మాధవాయిపాలెం, చిన మామిడిపల్లి ఓఎన్జీసీ కాలనీ, జవదాలవారి పేట, లాకుపేట ప్రాంతాల్లో తాగునీటి కొరత ఉంది. ఇది దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య. 1956లో మున్సిపాలిటీ ఏర్పడింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో తాగునీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు చేయించడమే కాకుండా టెడర్లు ప్రక్రియ పూర్తి చేయించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

ప్రాజెక్ట్ స్వరూపం

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం 96 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తారు. దీనికి తోడు కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించనున్నారు. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించబోతున్నారు.

ఇక ఇబ్బందులు ఉండవు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్ల వల్లే ఇబ్బందులు ఉన్నాయి. ఈ సమస్య ఇక ఉండదు. రూ.61.81 కోట్లతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు ఎమ్మెల్యే చొరవ చూపించారు. చాలా ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. ఇక వేసవిలో కూడా తాగునీటి ఇబ్బంది అనేది ఉండదు. త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నాయి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

ఆర్టీసీ కార్గో సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలి


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

నరసాపురం: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి సూచించారు. ఆర్టీసీ డిపోలో చేపట్టిన కార్గో సర్వీస్‌ల డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా సోమవారం డోర్ డెలివరీ చేసిన వారి వివరాలు లక్కీ డ్రా నిర్వహించారు. ముగ్గురు విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా సరుకుల రవాణా తక్కువ చార్జీలతో అందిస్తున్నట్లు చెప్పారు. 50 కిలోల బరువు ఉన్న పార్సిల్స్‌ను 10 కిలోమీటర్లు వరకూ డోర్ డెలివరీ చేయడానికి సంస్థ సదుపాయం కల్పించిందని తెలిపారు. డోర్ డెలివరీ సర్వీస్‌లను ప్రోత్సహించడానికి లక్కీడ్రా నిర్వహించామన్నారు. ఆర్టీసీ కార్గో సర్వీస్‌లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకుగానూ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.ధనలక్ష్మి, ఎస్ఎన్ వర్మ, కార్గో డీఎంఈ పీతల రవీంద్ర పాల్గొన్నారు.

9న వరసిద్ధి వినాయకుని కల్యాణం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పాలకొల్లు అర్బన్: కాణిపాకం వరసిద్ధి వినాయకుని ఉత్సవ మూర్తులకు పాలకొల్లులో నవంబర్ 9న కల్యాణం, శాంతి హోమం, అభిషేకాలు నిర్వహించనున్నారు. పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సేవ్ టెంపుల్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం 58 మంది జంటలకే ఈ కల్యాణోత్సవంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కేవీ కృష్ణవర్మ, డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, భూపతిరాజు రామచంద్రరాజు, డీటీడీసీ బాబు, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రపై ప్రచారం


ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినిస్టన్ బాబు

పోడూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు యువజనులంతా పెద్ద సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు కోరారు. పోడూరు మండలం రావిపాడులో సోమవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి ఆదేశాల మేరకు వినిస్టన్‌బాబు యువజనులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నవంబర్ 8వ తేదీన పాలకొల్లులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు యువజనులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెదిరాజు, గ్రామ సర్పంచ్ సాయిరాజు, సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, పార్టీ నాయకులు దేవ రాజేష్, ఏసుబాబు, దేవ జాన్, నల్లి నాగరాజు, వడ్డి సత్యప్రసాద్, ఇంజేటి వరప్రసాద్, నాతి చరణ్, విప్పర్తి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులతోనే సమాజాభివృద్ధి

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు

యలమంచిలి: ఆరోగ్యవంతులైన ప్రజలతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మట్లపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గోపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, సర్పంచ్ చల్లా లక్ష్మీవిశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కడలి సునీత, ఇసుకపల్లి శ్రీధర్ వర్మ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి నరసింహారావు, నాయకులు పేరిచర్ల వెంకట నరసింహరాజు, చిట్టూరి శ్రీనివాసరావు, కడలి ఆంజనేయులు, కొల్లాటి పెద్దిరాజు, కొల్లు మాధవరావు, కోరం చిట్టిబాబు, కోరం లలితకుమారి, జిల్లా నాయకులు ఉచ్చుల స్టాలిన్, బోనం బులి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి: మట్లపాలెంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


నరసాపురం రూరల్: తూర్పుతాళ్లు-2లో జరిగిన శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

నరసాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ కోరారు. నరసాపురం మండలం తూర్పుతాళ్లు-2 గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని, దీనిలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,200 జబ్బులను చేర్చడంతో పాటు ప్రతి సచివాలయం పరిధిలో ఒక హెల్త్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించి ఆ సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ పూర్తిస్థాయిలో వైద్యసేవలను అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ క్యాంపులో పరిష్కారం కాని రోగాలకు ఆరోగ్యశ్రీ వర్తించే కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయడం జరుగుతుందని వాటికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వైద్య శిబిరంలో ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, మందులు ఇచ్చే కౌంటర్, న్యూట్రీషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు డాక్టర్లు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డ్రామాలను కట్టి పెట్టాలి

పాలకొల్లు అర్బన్: ఎమ్మెల్యే నిమ్మల వాస్తవాలు తెలుసుకోకుండా రైతుల పంట పొలాల్లో వాలీబాల్ నెట్ కట్టి డ్రామాలు ఆడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) హితవు పలికారు. ఎమ్మెల్యే నిమ్మల పెనుమదంలో రైతు పంట పొలంలో వాలీబాల్ నెట్ కట్టి నీటి ఎద్దడిపై ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని సోమవారం ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం పోడూరు మండలం పెనుమదం శివారు అల్లంగుంటలో నీటి ఎద్దడి ఉన్న పంట చేలను పరిశీలించి తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులను అలర్ట్ చేసి వంతుల విధానంలో ముందుగా సాగునీరు ఎద్దడి ఉన్న పంట చేలకు నీరు అందించాలని సూచించినట్లు గుడాల గోపి చెప్పారు. అయితే అల్లంగుంటలో గుబ్బల లక్ష్మీనారాయణ అనే రైతు తన ఆరు ఎకరాల్లో నాట్లు వేసి వ్యక్తిగత పనులపై గుజరాత్ వెళ్లిపోయారన్నారు. అతను తిరిగి రెండు రోజుల క్రితమే స్వస్థలానికి వచ్చారన్నారు. ఆ రైతు పంట చేనుకు మందు వేయకుండా, కలుపు తీయకుండా బీడు భూములుగా వదిలేశారన్నారు. కనీసం ఇరిగేషన్ అధికారులు వంతుల విధానంలో సాగునీరు అందించినా ఆ రైతు పెట్టుకోలేదన్నారు. ఎమ్మెల్యే నిమ్మల లక్ష్మీనారాయణ పంట చేనుకు నీరు పెడితే ఆ కూలీ డబ్బులు తాము చెల్లిస్తామని గుడాల గోపి తెలిపారు. లక్ష్మీనారాయణ పంట పొలాన్ని ఆనుకుని ఉన్న రైతుల చేలన్నీ సమృద్ధిగా నీరు అందుకుని వరి దుబ్బులు ఏపుగా పెరిగాయన్నారు. వాస్తవానికి చించినాడ పంట కాలువపై 11,500 ఎకరాలకు కేవలం 100 ఎకరాల్లోనూ, అలాగే యలమంచిలి మండలం శిరగాలపలి, మేడపాడు, యలమంచిలి గ్రామాల్లో 100 ఎకరాల్లో నీటి ఎద్దడి ఉందని, ఇరిగేషన్ అధికారులకు సూచనలిచ్చి వంతుల విధానంలో నీరం అందించాలని ఆదేశాలిచ్చామన్నారు. ఇవేమీ తెలుసుకోకుండా ఎమ్మెల్యే నిమ్మల వాలీబాల్ ఆడటం సిగ్గుచేటన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో మేలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదన్నారు. తన డ్రామాలకు ఎమ్మెల్యే చెక్ పెట్టకపోతే వైఎస్సార్ సీపీ కార్యకర్తల నుంచి తీవ్రమైన పరాభవం చవిచూడాల్సి వస్తుందని గోపి అన్నారు.


పెనుమదంలో అధికారులతో కలిసి పంట పొలాన్ని పరిశీలిస్తున్న గుడాల గోపి

సులభ్ కాంప్లెక్స్ వద్దంటూ రైతుల నిరసన

పెనుగొండ: పెనుగొండ కళాశాల కూడలిలో మండల పరిషత్ నిధులతో నిర్మించ తలపెట్టిన సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం వద్దంటూ ఆచంట ఛానల్ పరిధిలోని రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నిర్మాణ పనులు ప్రారంభం కాగానే రైతులు అక్కడకు చేరుకుని నిర్మాణం నిలిపి వేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఆచంట ఛానల్ ఇప్పటికే మురికి కూపంగా మారిందని, దీని వలన 960 ఎకరాల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడతారన్నారు. పంట కాలువలోకి సులభ్ కాంప్లెక్స్ లోని నీరు, మలం మొత్తం పంట కాలువలోకి వస్తుందని విమర్శించారు. నిర్మాణ పనులు నిలిపి వేయాలంటూ ఎంపీడీవో, ఏఈ పీఆర్‌లను కోరారు. ఇప్పటికే మండల పరిషత్‌లోనూ, పంచాయతీలోనూ తీర్మానాలు ఆమోదించడం వలన పనులు ప్రారంభించి ఉండవచ్చునని అధికారులు తెలిపారు. పంట కాలువలోకి ఎటువంటి నీరు వెళ్లకుండా సెప్టెక్ ట్యాంకు నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం చేయదలచి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అయితే, రైతులు నిర్మాణంపై అభ్యంతరం తెలపడంతో నిర్మాణ పనులు నిలిపినట్లు వారు తెలిపారు.

నేడు కొంతేరులో పౌర హక్కుల దినోత్సవం

యలమంచిలి: పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మాతా సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ ముఖ్యఅతిథిగా రానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి

పెనుగొండ: మహాసేన రాజేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మహాసేన పేరుతో టీడీపీలో చేరి దళితులంతా చంద్రబాబుకు ఓటేసి గెలిపిస్తామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. టీడీపీకి ఊడిగం చేసుకోవాలంటే చేసుకోవాలి కానీ, దళితులంతా వచ్చేస్తారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. దళితులను ఉద్ధరిస్తానని చెప్పి మహాసేనను తీసుకువెళ్లి చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా జాతిని తాకట్టు పెట్టే ప్రకటనలు చేయవద్దంటూ హితవు పలికారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి

పాలకొల్లు అర్బన్: వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డులోని ముఖ్య నాయకులంతా సమన్వయం చేసుకుని సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో సోమవారం పట్టణంలోని 31 వార్డుల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదీన పాలకొల్లులో సామాజిక సాధికార బస్సు యాత్ర ఉంటుందని తెలిపారు. ఈ యాత్రకు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చేలా ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త బాధ్యత తీసుకోవాలని కోరారు. 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పాలకొల్లు మండలం పూలపల్లి మలుపు వద్ద నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అలాగే 5 గంటలకు పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకుని అక్కడ భారీ బహిరంగ సభ జరగనుందన్నారు. సభలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన రాష్ట్ర మంత్రులు పాల్గొంటారన్నారు. బస్సు యాత్ర విజయవంతం చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలకొల్లులో విజయం సాధిస్తామనే ధీమా ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, దేవస్థానం చైర్మన్‌లు కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, మద్దా చంద్రకళ, రావి నాగేశ్వరరావు, ధనాల శ్రీనివాస్, బండి రమేష్, మోర్త గిరీష్, యడ్ల ధనకొండలరావు, తలుపుల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

జిన్నూరులో..

పోడూరు మండలం జిన్నూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక నాయకులతో సమీక్షించారు. సమావేశంలో పోడూరు మండల కన్వీనర్‌గా నియమితులైన పితాని సత్యనారాయణ (చిన్నా)ను గుడాల గోపి ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జెడ్పీటీసీ గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు డీటీడీసీ బాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో నేత్ర వైద్యశిబిరం

యలమంచిలి: ఆంధ్రా బ్యాంకు శత జయంతి ఉత్సవాలలో భాగంగా మేడపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో సోమవారం బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ సిబ్బంది పరీక్షలు చేశారు.

వైద్యులు, అధికారులకు సన్మానం


వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గోపి

యలమంచిలి: వైద్యులు, వైద్య సిబ్బంది, అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా పని చేయడం వలనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలో ఆఖరి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మట్లపాలెంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల రోజులు వైద్య సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య) నాయకత్వాన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, సర్పంచ్ చల్లా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కడలి సునీత, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుడిలా పనిచేయాలి


గోపికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రభాకరరావు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులందర్నీ కలుపుకుని పార్టీ విజయానికి సైనికుడిలా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా నియమితులైన విప్పర్తి ప్రభాకరరావు సోమవారం గోపిని కలిసి శాలువాతోసత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబును కూడా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గోపి పార్టీ మండల కన్వీనర్ ప్రభాకరరావుకు పలు సూచనలు చేశారు.

అన్నసమారాధనలు

నరసాపురం రూరల్: శ్రీ దేవీ శరన్నవరాత్రుల ముగింపు వేడుకలను పురస్కరించుకుని మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో అన్నసమారాధనలు నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారి తోట, కెనాల్ రోడ్డు, పెద్దపల్లి పాలెం, గుంటపల్లవపాలెం, గ్రామాల్లో అఖండ అన్నసమారాధన జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మొగల్తూరు కుక్కల వారితోటలో కుక్కల ముత్యాలరావు సమర్పించిన 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రూ3,500లకు చెల్లారి గణపతి వేలంలో దక్కించుకున్నారు.